అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- గణిజర్లలో గడపగడపకు మన ప్రభుత్వం


గణిజర్లలో సంక్షేమ లబ్ధి కరపత్రాలు అందజేస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

చింతలపూడి : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. చింతలపూడి మండలం, గణిజర్ల గ్రామంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి పథకాల ద్వారా అందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. దేశంలో ఇన్ని పథకాలు పేదలకోసం ప్రవేశపెట్టిన రాష్ట్రం లేదన్నారు. వేల కోట్లు పేదల ఖాతాల్లో నేరుగా జమచేస్తుండడం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. సచివాలయ ఉద్యోగులు ఎలా పని చేస్తున్నారని, వలంటీర్లు మీ ఇంటికి వస్తున్నారా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలోని ప్రతి గడపకూ వెళ్లి మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరించి ప్రభుత్వ పథకాలను వివరించారు.

ఆర్‌బీకే కేంద్రం ప్రారంభోత్సవం

గ్రామంలో రూ.23.50 లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తి చేసుకున్న రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ఎలీజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అన్ని సదుపాయాలు ఒకే చోట కల్పించడం ఆర్‌బీకేల ఉద్దేశ్యమన్నారు. రైతులు ఆర్‌బీకేలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకీరెడ్డి, ఎంపీపీ డా.బి రాంబాబు నాయక్, జెడ్పీటీసీ నీరజా సుధాకర్, సర్పంచ్ బొల్లినేని వెంకట్రావు, చింతలపూడి పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, సొంగా ఉదయ్ కుమార్, జక్కంపూడి పుల్లారావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, బుల్లా దాసు, సొసైటీ చైర్మన్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, నగర పంచాయతీ సచివాలయ కన్వీనర్ ఎస్. దుర్గారావు, మిరియాల దిలీప్, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలరాజు ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు


ఎమ్మెల్యే బాలరాజు సంపూర్ణ ఆరోగ్యం కోసం పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

టి.నరసాపురం : ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ప్రార్థిస్తూ ప్రకాష్‌నగర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు పూజలు నిర్వహించారు. స్థానిక రామాలయంలో భూక్యా వేణుగోపాల్, దరబోయిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో 101 కొబ్బరి కాయలు కొట్టారు. కార్యక్రమంలో అర్జా బాలయ్య, ఎంపీటీసీ కుంజా కిరన్, జి.బాలకృష్ణ, పండు, వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్ హోంకు బియ్యం అందజేత


చిల్డ్రన్ హోంకు బియ్యం అందజేస్తున్న దాతలు

కామవరపుకోట : అనాథ బాలల పాలిట కల్పతరువుగా ఉన్న షేర్ చిల్డ్రన్స్ హోమ్‌కు దాతలు సహకరించాలని ఆడమిల్లి గ్రామానికి చెందిన సీడ్ ఆర్గనైజర్, వైఎస్సార్ సీపీ యువ నాయకులు వేముల సాయిబాబు అన్నారు. ఆదివారం ఏలూరులోని కలపర్రు గ్రామంలో ఉన్న చిల్డ్రన్ హోమ్‌కు ఆయన 100 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ రానున్న రోజుల్లో చిల్డ్రన్ హోమ్ వారికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో చింతలపూడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొట్ల లక్ష్మణ్, నాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ


స్వామికి లక్ష తమలపాకుల పూజ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : పొంగుటూరు గ్రామ పంచాయతీ శివారు కన్నాయిగూడెంలో ఆదివారం శ్రీ అభయాంజనేయ స్వామి వారికి లక్ష తమలపాకుల పూజ ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ప్రధాన రహదారి పక్కన నెలకొలిపిన భారీ ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తూ దక్షిణ భారత బీజేపీ కో-ఆర్డినేటర్ పూరిగళ్ళ రఘురాం, అరుణ దంపతులు శాస్త్రోక్తంగా ఈ పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని హనుమాన్ చాలీసా, సుందరకాండ పారాయణ చేశారు.

వికలాంగులందరికీ పింఛన్లు ఇవ్వాలి

ఏలూరు (టూటౌన్): వికలాంగులందరికీ పింఛన్లు ఇవ్వాలని వికలాంగుల సంక్షేమ సంఘం (విసాస్) రాష్ట్ర అధ్యక్షులు అల్లాడి నటరాజు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఒకే రేషన్ కార్డులో వికలాంగులు ఉన్న కుటుంబంలో పింఛన్‌కు అర్హత ఉన్న అందరికీ లబ్ధి అందించాలన్నారు. పెళ్లితో సంబంధం లేకుండా ఒకే కుటుంబంలో ఎంతమంది వికలాంగులు ఉన్నా అందరికీ పింఛన్ ఇవ్వాలని, సర్వేల పేరుతో వికలాంగుల పింఛన్‌లను తొలగించడం తగదన్నారు. ఇటీవల తొలగించిన వికలాంగుల పింఛన్‌లను తిరిగి పునరుద్ధరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పింఛను పొందుతున్న వికలాంగుని కుటుంబంలో వివిధ రకాల పింఛన్లకు అర్హులుంటే వారికి కూడా ఆయా పింఛన్లు అందించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో తైపూసం మహోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పోస్టల్ కాలనీలోని శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో మాఘ పుష్యమి నక్షత్ర పర్వదినం సందర్భంగా ఆదివారం తైపూసం మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తమిళనాడు సంప్రదాయం తరహాలో ఉదయం స్వామి వారికి గోక్షీరంతో 108 కలశాలతో అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. అంతకు ముందు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, సుబ్రహ్మణ్యేశ్వర హోమం వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, మానస దంపతులు పాల్గొన్నారు. వారికి ఆలయ అర్చక స్వాములు తీర్థ ప్రసాదాలు అందించి వేద ఆశీర్వచనం పలికారు. అనంతరం దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ మేడిపల్లి విజయరాజు, ఉప స్థపతి ఎం. నాగేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ గూడూరి ఆదిలక్ష్మి, ప్రసాద్ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఈఓ కలగర శ్రీనివాస్ పర్యవేక్షించారు.

వైభవంగా వీరభద్రుడి కల్యాణం


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు, విశేషాలంకరణలో భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి

కామవరపుకోట : కామవరపుకోటలో కొలువైన భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి కల్యాణం ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుల ఆశీర్వచనాలతో మంగళ వాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. అన్ని శివాలయాల్లో శివరాత్రి సమయంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు, అందుకు భిన్నంగా తెల్లవారుజామున సూర్యోదయానికి ముందే స్వామి వారి కల్యాణం వెన్నెలలో నిర్వహించడం ఇక్కడ ప్రత్యేకత. ఈ కల్యాణ ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం శ్రీ వీరభద్ర స్వామి అన్నదాన కమిటీ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి ప్రారంభించారు. సుమారు 15 వేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు అన్నదాన కమిటీ చైర్మన్ కడిపి పాపారావు తెలిపారు.

ప్రమాదాల నివారణకు స్టాపర్ల ఏర్పాటు


తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారిపై స్టాపర్లు ఏర్పాటు చేసిన పోలీసులు

జంగారెడ్డిగూడెం : మితిమీరిన వేగం కుటుంబాలను కకావికలం చేస్తాయని, కావున నిర్దేశించిన వేగంలోనే గమ్యస్థానాలకు చేరుకోవాలని వాహనదారులకు ఎస్సై ఎం.సాగర్‌బాబు సూచించారు. జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారిపై ఆదివారం స్టాపర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై ఎటువంటి సురక్షిత నియమాలు పాటించకుండా వేగంగా వాహనాలు నడుపుతున్నారని, దీని వల్ల ప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు. ప్రమాదాలు జరగకుండా వాహనదారులు నిర్దేశించిన వేగంలో వెళ్లాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌లు, కార్లు తదితర వాహనాల్లో ప్రయాణించే వారు సీటు బెల్టులు ధరించడం తప్పనిసరి అని అన్నారు. కాగా తాడువాయి, వేగవరం, జంగారెడ్డిగూడెం తదితర చోట్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో స్టాపర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా ఆలయ నిర్మాణ పనులు


మదన గోపాలస్వామి ఆలయంలో రూపుదిద్దుకుంటున్న దశావతారాల బ్లాక్

కొయ్యలగూడెం : శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈనెల 27వ తేదీ నుంచి ఆలయ ప్రారంభోత్సవం, దేవేరులతో సహా స్వామివారి విగ్రహాల పునః ప్రతిష్ట కార్యక్రమాలు వారం పాటు నిర్వహించనున్న నేపథ్యంలో పనులను వేగవంతం చేశారు. రాష్ట్రస్థాయి శిల్పకళాకారుడు గునుపూడి శంకరం పర్యవేక్షణలో 30 మందికి పైగా శిష్య బృందం శిల్పాలను తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి, హోం మినిస్టర్లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని పాలకమండలి కమిటీ చైర్మన్ ముద్దు గోపి తెలిపారు. ఆలయ నిర్మాణ పనులు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. ఆలయ ప్రవేశ ద్వారం నుంచి దశావతారాల బ్లాక్‌తో సహా అష్టలక్ష్మి విగ్రహాలతో కూడిన బ్లాక్‌ను తీర్చిదిద్దుతున్నారు. దాదాపు 230 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆలయ ప్రాశస్త్యం ఉట్టిపడే విధంగా సుమారు రూ.కోటి 30 లక్షల వ్యయంతో ఆలయాన్ని నిర్మిస్తునామన్నారు.

ఘనంగా ప్రారంభమైన జాతర మహోత్సవాలు


విశేషాలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

బుట్టాయగూడెం : కామవరం సమీపంలో కొలువై ఉన్న గద్దెరాజులు, గుబ్బల మంగమ్మ, కనకదుర్గమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా మాఘ శుద్ధ పౌర్ణమి రోజున ఈ వేడుకలను గిరిజనులు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా పూర్తిగా గిరిజన సాంప్రదాయంలో ఈ వేడుకలను ప్రారంభించారు. ఉదయం 6 గంటలకు అమ్మవారికి పసుపు, కుంకుమ పూజా కార్యక్రమాలను ఘనంగా చేశారు. అనంతరం వర్సా వారి ఇంటి ఇలవేల్పెన్న గద్దెరాజులు, గుబ్బల మంగమ్మ, దుర్గమ్మ తల్లులకు రాజుపటం పోసి తీన్మార్ డప్పులతో సంబరాలు చేసి గద్దెల మీదకు తీసుకువెళ్లారు. అనంతరం అడవిలోకి తీసుకువెళ్లి రాజు గద్దెలకు సమర్పించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జాతర మహోత్సవాలు ఈనెల 9వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

పొగాకు రైతులకు ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా

బుట్టాయగూడెం : పొగాకు రైతులు వ్యవసాయానికి ఇబ్బంది పడకుండా సోమవారం నుంచి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు బుట్టాయగూడెం మండల విద్యుత్ శాఖ ఏఈ నడింపల్లి శ్రీనివాస్ వర్మ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పొగాకు రైతుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికే వ్యవసాయానికి నిరంతరంగా 9 గంటలపాటు విద్యుత్ సరఫరా చేస్తోందని చెప్పారు. అయితే ప్రస్తుతం తాము ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా చేస్తున్న సమయంలో ఏదైనా అంతరాయం ఏర్పడితే మళ్లీ ఆ అంతరాయ సమయాన్ని కవర్ చేసే విధంగా రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పారు.

మాజీ మంత్రి వసంతకుమార్ మృతికి సంతాపం


వసంతకుమార్ మృతికి సంతాపం తెలుపుతున్న కాపు కల్యాణ మండప ట్రస్ట్ చైర్మన్ వాసుబాబు, సభ్యులు

ద్వారకాతిరుమల : క్షేత్రంలో కాపు కల్యాణ మండప నిర్మాణానికి ఎనలేని కృషి చేసిన రాష్ట్ర మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ లేని లోటు తీరనిదని ఉంగుటూరు ఎమ్మెల్యే, కాపు కల్యాణ మండప ట్రస్ట్ చైర్మన్ పుప్పాల వాసుబాబు అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా వారు వసంత కుమార్ మృతికి సంతాపాన్ని తెలిపారు. అనంతరం ట్రస్టు అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కాపు కల్యాణ మండప ట్రస్టు గౌరవాధ్యక్షుడు చిన్నమిల్లి వెంకట్రాయుడు, ట్రెజరర్ మాకా శ్రీనివాస్, కార్యదర్శి పాశం రామాంజనేయులు, కల్యాణ మండప స్థలదాత పెద్దిరెడ్డి వేణుగోపాల కృష్ణారావు, సభ్యులు పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్, మైగాపుల మోహన్‌రావు, వైఎస్సార్ సీపీ నాయకులు పసుపులేటి సత్యన్నారాయణ, ఉక్కుర్తి వెంకట్రావు, రుద్ర శివాజీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామకోటి మహోత్సవాలు ప్రారంభం


ఉత్సవమూర్తులను ప్రాంగణం వద్దకు తీసుకువస్తున్న శ్రీరామకోటి విశ్వశాంతి సమాజం ప్రతినిధులు


విశేష అలంకరణలో శ్రీ సీతారాములు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో 91వ శ్రీరామ కోటి మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వివిధ ధ్వజాల ఆరోహణలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి విశ్వశాంతి సమాజం సభ్యులు మౌనధ్యానం, భక్తిగీతాలపానలు, హరే రామ సంకీర్తనలు చేశారు. అనంతరం విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలను ప్రారంభించి కలశ స్థాపన, అఖండ దీపారాధన, స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్యహోమం చేసి స్వామివారి నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వీరా ప్రసాద్ శిష్య బృందం నిర్వహించిన సంగీత కచేరి వీనులవిందు చేసింది. అనంతరం మద్దూరి సత్యనారాయణ ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. రాత్రి 7 గంటలకు నగరానికి చెందిన నృత్యాంజలి కళానికేతన్ ఆధ్వర్యంలో నాట్యాచార్య గండికోట రాజేష్ శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. తొలుత అర్చక స్వాములు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీవిశ్వేశ్వరశర్మ విశేష పూజలు నిర్వహించగా శ్రీరామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలి


టెకు బ్యాంక్ మహాజన సభలో ప్రసంగిస్తున్న బ్యాంక్ చైర్మన్ అంబికా ప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ది ఏలూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ (టెకు బ్యాంక్)లో రుణాలు తీసుకున్న ఖాతాదారులు సక్రమంగా ప్రతి నెలా వాయిదా చెల్లించాలని ఆ బ్యాంక్ చైర్మన్ అంబికా ప్రసాద్ కోరారు. ఆదివారం స్థానిక శ్రీగాంధీ ఆంధ్ర జాతీయ మహా విద్యాలయం ప్రాంగణంలో టెకు బ్యాంక్ మహాజన సభ నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన అంబికా ప్రసాద్ మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా వాయిదాలు చెల్లించని పక్షంలో వాటిని ఒత్తిడిలో ఉన్న రుణాలుగా భావిస్తారని, ఆయా రుణ ఖాతాల నుంచి రావలసిన అసలు, లేక వడ్డీ 90 రోజులు దాటి వసూలు కాకుండా ఉంటే అలాంటి రుణాన్ని నిరర్థక ఆస్తిగా ప్రకటించాలని రిజర్వ్ బ్యాంక్ ఆదేశించిందని తెలిపారు. తమ బ్యాంక్ వ్యాపారాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించడానికి తగిన కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. బ్యాంక్ ఉద్యోగుల సర్వీస్ నిబంధనలను ప్రస్తుత నిబంధనలకు అనుగుణంగా మార్చడానికి మహాజన సభ ఆమోదించింది. అలాగే 2022 మార్చి 1వ తేదీ నుంచి 2023 జనవరి 31వ తేదీ వరకు నూతనంగా చేర్చుకోబడిన సభ్యత్వాల, వాపసు చేసిన వాటాధనాలను సైతం మహాజన సభ ఆమోదించింది. బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.అచ్యుత రావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు రూరల్: ఏలూరు మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గ అధ్యక్షులుగా పాటూరి సురేష్‌బాబు ఎన్నికయ్యారని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఏలూరులోని యూనియన్ జిల్లా కార్యాలయంలో జరిగిన ఎన్నిక వివరాలను ఆయన వెల్లడించారు. గౌరవ అధ్యక్షులుగా ఓవీ ధనుంజయరావు, సహాధ్యక్షులుగా కె.శ్రీధర్, జి.మాధవిలత, ప్రధాన కార్యదర్శిగా పంపన శ్రీనివాస్‌కుమార్, కోశాధికారిగా తాడేపల్లి యేషయ్య, కార్యదర్శులు పీవీ జనార్దనరావు, పీవీ సుబ్బారావు, బి.ప్రభాకర్‌రావు, కేవీఎస్ మణి, పి.సత్యనారాయణ, దుర్గాభవాని ఎన్నికయ్యారని వివరించారు. వీరితో పాటు ఆడిట్ కన్వీనర్‌గా బి.రవిశోభన్‌కుమార్, జిల్లా కార్యదర్శులుగా వి కనకదుర్గ, ఏవీఎస్ రాజు, ఎల్.కనకదుర్గ, ఎస్‌కే సుభాని బేగం ఎన్నికయ్యారని వెల్లడించారు. ఎన్నికల అధికారిగా నంబూరి రాంబాబు, పరిశీలకుడుగా పీవీ నరసింహరావు పాల్గొన్న ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి ముఖ్య అతిథిగా పాల్గొని ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడాలని నూతన కార్యవర్గానికి సూచించారని వివరించారు.

బైక్ ర్యాలీగా తరలివెళ్లిన యాదవ యువత


ద్వారకాతిరుమలకు బైక్ ర్యాలీగా తరలివెళుతున్న యువకులు

ఏలూరు (టూటౌన్): ద్వారకాతిరుమలలో ఆదివారం నిర్వహించిన యాదవ యువ సమ్మేళనం కార్యక్రమానికి యాదవ యువకులు మోటారు బైక్ ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ఏలూరు జిల్లా యాదవ యువ సమితి అధ్యక్షుడు కాట్రు బాలకృష్ణ (బాలు) ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏలూరులో బైక్ ర్యాలీని ప్రారంభించిన జిల్లా అధ్యక్షుడు బాలు మాట్లాడుతూ జిల్లాలో యాదవులు రాజకీయ పార్టీల గెలుపోటములను నిర్ణయించే శక్తిగా ఉన్నారన్నారు. అయినా యాదవులకు రాజకీయంగా తగిన గుర్తింపు రావడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో యాదవులకు ఒక ఎమ్మెల్యే సీటు కేటాయించాలని కోరారు. యాదవ కార్పొరేషన్‌కు ఏడాదికి రూ.2వేల కోట్లు కేటాయించాలని, యువతకు ఉపాధి కొరకు రూ.10 లక్షల రుణాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారికి కార్లను 50 శాతం సబ్సిడీతో కేటాయించాలన్నారు. పేద యాదవ విద్యార్థులకు గ్రూప్స్, సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించాలని, మెరిట్ సాధించిన ఆసక్తి కలిగిన విద్యార్థులు 50 మందిని ఏటా విదేశాలకు పంపించాలన్నారు. పశ్చిమగోదావరి జిల్లా యాదవ సమితి అధ్యక్షుడు నీలపాల దినేష్, పొన్నుబోయిన సురేష్, కాట్రు విజయ్, పెనుబోయిన మహేష్, ఎం.పానకాల యాదవ్ పాల్గొన్నారు. ర్యాలీ ఏలూరు నుంచి కామవరపుకోట మీదుగా ద్వారకాతిరుమల తరలి వెళ్ళింది.

వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

జంగారెడ్డిగూడెం : పట్టణంలో ఆదివారం ఎస్సై ఎం.సాగర్‌బాబు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా వెళుతున్న ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనదారులతో హెల్మెట్‌లు కొనుగోలు చేయించి వాటిని ధరింప చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ హెల్మెట్‌లు తప్పనిసరిగా ధరించి వాహనాలను నడపాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పారిజాతగిరి సూపరింటెండెంట్‌కు ఈవోగా పదోన్నతి


ప్రసాదరావును ఆలయ మర్యాదలతో సత్కరిస్తున్న ప్రధానార్చకులు రవికుమారాచార్యులు

జంగారెడ్డిగూడెం : స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి ఆలయ సూపరింటెండెంట్ యవీ ప్రసాదరావు గ్రేడ్-1 ఈవోగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆయన కృష్ణా జిలాల యాలమకుదురు కనకదుర్గమ్మ తల్లి ఆలయ కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రసాదరావు గోకుల తిరుమల పారిజాతగిరి వెంకటేశ్వరస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించుకున్నారు. అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆలయ మర్యాదలతో ప్రసాదరావును సత్కరించి, స్వామి వారి శేషవస్త్రాలు, ఫొటోలు, వేదాశీర్వాదం అందించారు. కార్యక్రమంలో ఈవో మానికల రాంబాబు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన ఆటో


రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన ఆటో

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి మండలం దర్భగూడెం సమీపంలో ట్రాక్టర్‌ను వెనుక ఉన్న ఆటో ఢీకొట్టిన సంఘటనలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం మండలం ఏ. పోలవరానికి చెందిన అంజిబాబు తన ఆటోలో దర్భగూడెం గ్రామం వచ్చాడు. ఆ సమయంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఆటో నుజ్జయింది. అంజిబాబుకు గాయాలు కావడంతో అతనిని వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో ఆటోలో ఎవ్వరూలేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెప్పారు.

హెచ్‌ఎంకు సన్మానం

ఏలూరు రూరల్: గుడివాకలంక జెడ్పీ హైస్కూల్ ఇంగ్లిష్ టీచర్‌గా పి.రజనీకుమారి నియమితులయ్యారు. వెంకటాపురం మస్తాన్‌మన్యంకాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆమె పదోన్నతిపై గుడివాకలంకకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు రజనికుమారి దంపతులకు దుశ్శాలువా కప్పి సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి ఆమె చేసిన కృషిని కొనియాడారు. ఎల్.కనకదుర్గ, ఎం.విజయపద్మలత, పలువురు విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

జంగారెడ్డిగూడెం రూరల్ : పుట్లగట్లగూడెంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం అందుకున్న సీఐ బాలా సురేష్, లక్కవరం ఎస్సై దుర్గా మహేశ్వరరావు తన సిబ్బందితో దాడులు జరిపారు. ఈ దాడుల్లో 8 మందిని అరెస్ట్ చేసి, రూ.11 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటపై దాడి

జంగారెడ్డిగూడెం : పేకాట శిబిరంపై దాడి చేసి 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. మార్కండేయపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి 8 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.